సుశీల ఇంకా రాలేదు. కుమార్‌కు చాలా చిరాగ్గా అనిపించింది. ఎన్నో యుగాలనుంచి తాను సుశీలకోసం అలా పడిగాపులు కాస్తున్నట్లుగనే ఉందతనికి. గదిలో అటూ ఇటూ నడిచాడు కుమార్.

టైం పదిన్నర అవుతోంది. అంటే అపుడే అర్ధరాత్రి దగ్గర పడుతోందన్నమాట! ఇంకాసేపు పోతే తెల్లగా తెల్లారి పోతుంది. కూడానూ! ఇంతవరకూ సుశీల రాకపోవడం... ఇబ్బందిగా అనిపించింది కుమార్‌కు.


ఏమిటో, చాదస్తాలు! ఈ పెద్దాళ్ళు చేసే పనికి ఒక్కోసారి అర్థం, పర్థం కనపడవు. ప్రతిదానికీ ముహూర్తం అంటూ ఉంటారు. ఈ ముహూర్తపు గొడవ పెళ్లిచూపుల దగ్గర ఆరంభం అవుతుంది. తర్వాత నిశ్చితార్థానికి, తర్వాత పెళ్ళికి... పెళ్లిలో రకరకాల గొడవలకు రకరకాల ముహూర్తాలు - అవన్నీ దాటుకొంటూ వస్తే, ఆఖరికి ఇక్కడ - ఇక్కడకూడా ముహూర్తమే! దీనికి ముహూర్తం ఏమిటి?

కుమార్‌కు ఇపుడెవరైనా ముహూర్తాలు ఉండాల్సిన ఆవశ్యకత, వాటివల్ల కలిగే లాభాలు గురించి చెప్పి లాభంలేదు. అవన్నీ అతను వినడు. వినేందుకు తగిన మూడ్ లేదు.

సుశీల ఎపుడొస్తుందా? ఆ ముహూర్తం ఎపుడా అని మాత్రమే అతను ఎదురు చూస్తున్నాడు. ఆ ముహూర్తం ఎపుడో ఎవరైనా చెబితే, అదిమాత్రం వింటాడు.

సుశీల ఇంకా రాలేదు.

కుమార్ గదినంతా పరిశీలనగా చూశాడు. జీవితంలో ఇలాటి గదిలోకి రావటం ఇదే తొలిసారి. కానీ ఇలాటి గదులన్నీ ఎలా ఉంటాయో సినిమాలన్నీ పనిగట్టుకొని మరీ బోధిస్తున్నాయి. ఎటొచ్చీ సినిమాసెట్ అంత పెద్దది కాకపోయినా, ఉన్నంతలో గది బాగానే ఉంది. పందిరిపట్టెమంచాలు రెండు ఒకదాన్కొకటి ఆతుక్కుంటూ ఉన్నాయి. మంచంపై దోమ తెరల కోసం ఉన్న పట్టీల మీంచి సన్నని పూల తెర. ఓ మూల చిన్న స్టూలు. స్టూలుమీద ఏవో స్వీట్స్ మరో మూలనుంచి అగరొత్తుల వాసన నెమ్మదిగా గదినంతా చుట్టి చూస్తోంది. మూల మూలలన్నిటినీ పలకరించి వస్తోంది.



పొగచూసిన కుమార్ కు సిగరెట్ గుర్తొచ్చింది.

వెళ్లి సిగరెట్ అందుకొన్నాడు. జాగ్రత్తగా అంటించాడు. ఒకటి రెండు దమ్ములు లాగేసరికి - గదిలో పొగ మేఘంలా కమ్ముకొస్తున్నట్లు తోచింది. మంచంమీదికి జరిగి పక్కనే ఉన్న కిటికీ తీశాడు. కిటికీలోంచి పొగ బయటకు పోతోంది కానీ బయట నుంచి వెలుగు లోపలకి వస్తున్నట్లు తోచింది. ఫ్యాను ఒక్కసారి పెంచి, క్షణం ఆగి, కిటికీ మూసేశాడు.

ఎవరో నవ్వినట్లు ధ్వని.

కుమార్‌కు చిన్నతనంగాఅనిపించింది. తను గది కిటికీ తీసినందుకే కాబోలు ఈ నవ్వులు అనుకొన్నాడు. బయటకువెళ్ళి ''నవ్వకండోయ్, గదిలో నేనుతప్ప ఇంకెవ్వరూ లేరు. కావాలంటే మీరంతా వచ్చి అక్కడ వేసుకోండి మీ పేకాట!'' అని గట్టిగా అరవాలనిపించింది. కానీ అతని ధోరణి అతనికే నవ్వు తెప్పించింది.

'అమ్మో! - అలా అరిస్తే వాళ్ళు నిజంగా వచ్చి పేక పరిస్తే... అపుడు సుశీల వస్తే అందాలు పరిచేందుకు ఇంక చోటేది?

అందుకే కాబోలు, ఏపనైనా ఆలోచించి చెయ్యమన్నారు.

కానీ... సుశీల ఏదీ?

గది బయట ఏదో అలికిడి. కలకలం. సుశీల వస్తున్న వాసనలు! నిజానికి ఈ క్షణాల్లో తనూ సుశీలతోబాటు బయటనే ఉండాల్సి వచ్చేది. 'దంపతి తాంబూలాలంట!' తనకు ఇలాటివి నచ్చవు అని చెప్పబట్టి బతికిపోయి గదిలో పడ్డాడు.

సుశీల గదిలోకి వచ్చింది.

జీవితంలోకి కొండంత వెలుగు, బోలెడంత సంతోషం తెచ్చింది. మనసు నిండా మల్లెలు పూయిస్తోంది.

వెళ్ళి... వెళ్లి ఏదో ఏదో చేద్దామనిపించింది. తమాయించుకొంటూ అడుగులు వేస్తూ... వెళ్లి సుశీలను గదిలోకి, జీవితంలోకి - సాదరంగా ఆహ్వానించాడు. చెయ్యిపట్టుకొని నెమ్మదిగా నడిపించి తెచ్చాడు.

తెరలు తెరలుగా ఆనందం జీవితంలోకి నడుచుకొంటూ వచ్చింది. ఒకటొకటిగా అందాల్ని ఒలిచి ఇచ్చింది.

కుమార్‌కు అంచెలంచెలుగా స్వర్గాన్ని చేరుకుంటున్నట్లుగా ఉంది.

-అక్కడ ... అప్పుడు

రవ్వంత విశ్రాంతి - ఉక్కిరి బిక్కిరి చేస్తున్న క్షణాల్లో కొంత వెసులుబాటు చిక్కినట్లు!

పాలసంద్రంలాటి పరుపుమీద, తలగడపై తలపెట్టి అలసటను ఆనందంగా అనుభవిస్తున్న క్షణాల్లో...

ఒక్క పిడుగు పడినట్లయింది.

సుశీల ఏదో అడిగింది. ఆ ప్రశ్న - తొలినాడు భార్య అడిగిన తొలిప్రశ్న... వీణలు మోగినట్లుగా కాక పిడుగులు పడినట్లుగా... అసలు అడిగిందా - లేక గుండెల్లో తనకే ఉన్న అనుమానం పొరచాటున పైకి పొరలిందా?

''ఎలా జరిగిందండీ ఆక్సిడెంట్?'' అదీ ప్రశ్న

ఎలా జరిగింది? ఎప్పుడుజరిగింది? ఎందుకు జరిగంది???

బస్సు బోల్తాపడి! ఆరేళ్ళ క్రితం - ఎందుకు? తన దురదృష్టం. కారణం ఏదైనా ఇదే సరైన సమాధానం.

మనసులో కలవరపాటును దాచుకొంటూ పైకి నవ్వుతూ అన్నాడు కుమార్ '' నీకు ఈ సంగతి చెప్పలేదా మీ ఇంట్లో వాళ్ళు?''

''చెప్పారు - అయినా ఏదో...!''

ఆత్రుత, ఉత్సుకత, తెలుసుకోవాలనే కోరిక!!


ఎందరు? ఎందరు అడుగుతారు ఇదే ప్రశ్నను? పదాలు వేరు ప్రశ్న ఒకటే. ఆ ప్రశ్న వెనుక వాళ్ళ సానుభూతీ ఒకటే!

"ఏదో జరిగిపోయింది గీత బాగుండక... అయినా ఇప్పుడు నాకు గీత మారింది, నువ్వు వచ్చావుకదా!"

సుశీల నవ్వింది.

అయినా - భార్య అడిగిన ప్రశ్న మాత్రం... ఆక్సిడెంట్ - ఆరేళ్ల క్రితం బెజవాడ రోడ్‌మీద జరిగిన ఆక్సిడెంట్ గుర్తుగా మిగిలిన సగం కుడిచెయ్యిలాగ మొండిగా మనసులో మిగిలి పోయింది.

# చేదోడు



## పాలకోడేటి సత్యనారాయణ రావు

తొలిరోజు ఆనందం ఆ తర్వాత అంతంత మాత్రంగానే ఉంది కుమార్‌కు.

తెల్లగా తెల్లవారేసరికి - రాత్రి పాతబడింది. ప్రశ్నలో తీవ్రత తగ్గింది. కుమార్ మనసు రవంత కుదుటబడింది.

నవ్వుతూ ఆరోజునుంచీ ఆరంభమయ్యే కొత్తజీవితానికి స్వాగతం పలికాడు.

సుశీల వచ్చింది కాపురానికి. కొత్తకాపురం. జాగ్రత్తగా అన్నీ అమర్చుకోవాలనే ఆత్రం కుమార్‌కు ఉంది. గ్యాస్, కుక్కర్, ఫాన్, రేడియో - ఇవన్నీ ఇప్పటి జీవితానికి కనీసపు అవసరాలు. కొంత మిగిల్చి, మరికొంత అప్పో సప్పో చేసి - వీలును బట్టి వాషింగ్ మెషీన్, డైనింగ్ టేబిల్... కొనాలనే ఆలోచన.

సుశీల అదంతా విని నవ్వింది.

"బాగుంది మనకొచ్చేది ఎంత? అందులో ఇంటద్దె, ఇంటిఖర్చులు, బట్టలు, మీ ఖర్చు, ఇవన్నీ పోనూ... ఇంకా మిగలడం ఏమిటి, మిగిలినా అదీ బొటాబొటీగా ఉంటుంది!"

ఏమోకానీ...

కుమార్‌బాగా ఆలోచించి అన్నాడు "మన ఆశలకు తగినంత జీతం ఎప్పటికీ రాదన్నది నిజం. కానీ అలా అని ఆశల్ని చంపేసు కుంటామా? ఉన్నంతలో కొంతదాచుకొని..."

సుశీల నవ్వింది. చాలా సేపటి తర్వాతఅంది. "అంతావిని ఇలా అంటున్నానని అనుకోకండి! మీ కెంత జీతం వస్తుంది. ఏం చేస్తారు, ఎంత మిగులుస్తారు అని నేను అడగను కానీ..."

ఆగిపోయింది సుశీల.

"చెప్పు"

"మీరేమీ అనుకోకండి! నాకు నెలనెలా ఓ వంద రూపాయలు ఇవ్వండి! ప్రతినెలా దేనికి అని అడగకండి. ఏం చేస్తావ్ అనీ అడగొద్దు. నా పర్సనల్ ఖర్చు అనుకోండి. కాటుక్కీ, కుంకుమకూ అనుకోండి. చీరకు సారెకు అనుకోండి. కానీ తప్పకుండా ఇవ్వండి"

కుమార్ ఉలిక్కి పడ్డాడు.

నెలకు వంద - బాబోయ్, ఇవ్వగలిగే స్థోమత...?

"లేదని అనకండి. ఉన్నంతలో సర్దుకొందాం. మిగిలినదే మీ కొచ్చే జీతం అనుకొందాం. సరేనా?"

కుమార్‌కు ఇబ్బందిగా అనిపించింది. బెత్తెడంత జీవితం, జీతం. ఆశలు మాత్రం ఎక్కడో ఆకాశం అంచుల్ని తాకుతున్నాయి. నెలకు వంద రూపాయల పర్సనల్ ఖర్చు. ఇవ్వగలిగే రోజులా ఇవి? భరించగలిగే స్థోమతా తనది?

అయినా -

కొత్త జీవితం. ఆశల్ని అప్పుడే ఛంపెయ్య కూడదు. నాలుగు రోజులు గడిస్తే, జీవితం భయంకరంగా ఎదురై నిల్చినప్పుడు అప్పుడు సుశీలకే తెలుస్తుంది ఖర్చును ఎలా తట్టుకోలేక పోతామో - పెరిగేలోటు బడ్జెట్‌ను ఎలాపూడ్చుకోవాలో అర్థంకాని స్థితిలో అప్పుడు సుశీలే... తన డిమాండ్స్ చార్టర్‌లో మార్పులు పెడు తుంది. వంద వద్దులెండి. ఏదో అయిదు ఇవ్వండి, చాలు! అంటుంది. అంతవరకు ఇస్తూ పోతేనేం? అవసరం ఉన్నప్పుడు తీసుకోవచ్చు! అనుకొన్నాడు కుమార్.

ఇదయిన మరో పదిరోజులకు కుమార్‌కు ఇంకోసంగతి చెప్పింది సుశీల. తను రోజూ రెండు మూడు గంటల చొప్పున ట్యూషన్లు

చెప్తున్నట్లు.

''ఎంతొస్తుంది?'' అనడిగాడు కుమార్, అనవసరంగా హైరానా పడ్తున్నావా అనే పద్ధతిలో అడుగుతూ.

''ఎంతొస్తేనేం, ఇది నా స్వార్జితం! ఆదాయం వివరాలు, అటు ఖర్చు కూడా అడగకండి!'' అంది సుశీల.

సుశీల నవ్వుతూనేఅన్నా అది కుమార్‌కు గుండెల్లో గుచ్చినట్లుగా అనిపించింది. పెళ్లయిన ఇన్నిరోజులకే పెళ్లానికి స్వార్జితం అనే ధ్యాస వచ్చిందంటే... ఆడదానికి డబ్బు ఆశ పెరగనే కూడదు. పెరిగిందంటే అది ఇంతింతై వటు డింతయై అన్నట్లు పెరుగుతుందే కానీ తగ్గదు. అదే చెప్పాలనుకున్నాడు. కానీ... ఇంకా చేతిలోకి డబ్బులు రాకముందే ఉపన్యాసాలు ఇవ్వడం సరైన పని కాదని ఊరుకున్నాడు.

మరుసటి నెల జీతం రాగానే ముందు వంద రూపాయలుతీసి సుశీలకు ఇచ్చేశాడు. ఖర్చు అడగకుండానే. తనకు ట్యూషన్‌వల్ల ఎంత వచ్చిందీ ఏమిటీ కూడా కుమార్‌కు సుశీల చెప్పలేదు.

కాలం గడుస్తూనే ఉంది.

తను ఇస్తున్న మొత్తం ఏమవుతూ ఉందో కూడా కుమార్‌కు తెలీటం లేదు. సుశీల డబ్బును వృధా చేస్తున్న దాఖలాలు కూడా లేవు. కొంపదీసి - ఈ డబ్బును పుట్టింటికి పంపటం లేదు కదా అనే అనుమానం కూడా కుమార్‌లో తలెత్తింది. కానీ ఆ విషయం అడిగేందుకు అభిమానం అడ్డొచ్చింది.

ఓ రోజు...

కుమార్ ఇంటికి వచ్చేసరికి సుశీల ఇంట్లో లేదు. జేబులోంచి రెండో కీ తీసి లోపలికి వచ్చాడు. ఎక్కడికి వెళ్ళుంటుందా అనే ప్రశ్న!!

ఇంకా ఆదాయం చాలటంలేదని కొత్త ట్యూషన్లు ఏమైనా మొదలుపెట్టిందా? అంటే ఆశ సుశీలను మరికొంత లొంగతీసుకొందా?

కుమార్‌కు చాల కోపంగా ఉంది. ఈ రోజుతో అమీ తుమీ తేల్చుకోవాలని నిర్ణయించు కున్నాడు.

అరగంట తర్వాత వచ్చింది సుశీల. చేతిలో పెద్ద పాకెట్ తమాషాగా ఉంది. బజారుకెళ్లి వచ్చిందన్నమాట! ఏళ్లతరబడి కూడబెట్టి క్షణాల్లో ఖర్చుపెట్టడం...!

నవ్వుతూ పలకరించింది సుశీల- ''ఎంత సేపయింది మీరొచ్చి?''

కుమార్ ఏమీ అనలేదు.

''సారీ అండీ, చెప్దామనుకున్నా కానీ, మీకు సర్‌ప్రైజ్‌గా ఇస్తేనే బాగుంటుందని...'' అంటూ పాకెట్ తీసి భర్తకు అందిస్తూ అంది '' ఇదిగో ఇది మీకే!! వెళ్లి వేసుకొనిరండి, ప్లీజ్!!''

''కాదు సుశీలా...'' ఏదో అనబోయాడు.

''మీరేమీ అనకండి! నా మీద ఒట్టు. వెళ్లి వేసుకొని రండి, ప్లీజ్, నాకోసం!''

కుమార్ అందుకున్నాడు - కొత్తబట్టలన్న మాట!! అనవసరపు ఖర్చు!

అయినా కదిలాడు పక్కగదిలోకి . తలుపు దగ్గరగావేసి, పాకెట్ విప్పాడు.

పాకెట్‌లోంచి - ఆర్టిఫిషియల్ వించ్!!

తనకోసం భార్య 'కుడి చేతి' ని తెచ్చింది.

కుమార్ ఉలిక్కిపడ్డాడు.

దాన్ని చూస్తోంటే ఆరేళ్ల క్రితం- ఆక్సిడెంట్ లో పోయిన తన కుడిచేయి గుర్తొచ్చింది. సరిగ్గా మిగిలిన మొండిచెయ్యి గుర్తొచ్చింది.

అంటే -

ఇంతకాలమూ -

శోభనం రోజున ' ఎలా జరిగిందండీ ఆక్సిడెంట్!' అని అడిగిన క్షణాలనుంచీ ప్రతి క్షణమూ సు శీ ల తన అంగవైకల్యాన్నే అనుభవించిందా?

తను ఆమెను సాదరంగా దగ్గరకు తీసుకున్న క్షణాల్లో ఆమెకు తన ప్రేమకన్నా, తన మొండి చెయ్యే కనపడిందా?

కుమార్ గుండెలో కోత.

కళ్లల్లో నీళ్ల

ఆపుకొందామన్నా వీలుకానంతగా సుళ్ల తిరుగుతున్న నీళ్ళు.

ఎక్కడెక్కడినుంచో బాధగా నీళ్ల పైకి పొంగుతూ...

కుమార్ ఒక్కసారి నిశ్శబ్దంగా బావురు మన్నాడు.

క్షణం తర్వాత - బాధను ఆవుకొని -భార్య తెచ్చిన కానుకను తీసి మరోసారి చూసుకొని చేతికి పెట్టుకున్నాడు.

బయటకు వస్తూ భార్య కళ్లల్లోకి చూశాడు.

ఆమె కళ్లల్లో కొండంత తృప్తి.

తను బాధపడుతుంటే భార్య సంతోషాన్ని అనుభవిస్తోంది.

భార్యాభర్తలు ఒకే నాణెలోనివారు, అని ఎవరన్నారో కానీ, దానికి తన ఇంట్లోనే నిదర్శనం!

''అమ్మయ్య. సరిగ్గా సరిపోయింది!'' అంటూ సుశీల దగ్గరగా చేరింది.

ఆప్యాయంగా - మనసులో వ్యధను పక్కకి తోస్తూ భార్యను దగ్గరకి తీసుకున్నాడు కుమార్. ఆ క్షణంలో తన భార్యకు తను రెండు చేతులతోనూ హత్తుకొంటున్న తృప్తి ఉంటుందన్న ధ్యాసే అతనిలో కలిగింది.

భార్యను హత్తుకొంటున్నట్లుగా - ఎడమ చేతితో కుడిచేతిని తా కాడు. మెత్తగా - నిర్జీవంగా - అక్కడ కృత్రిమ అవయవం తగిలింది. గుండె లో ఎక్కడో బాధ రేగింది.

ఆ బాధసంగతి - సంసారనాణానికి రెండో వైపు బొమ్మ - సుశీలకు ఆ సంగతి తెలియదు.

*

